క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జనార్థన స్వామికి పవిత్రాల సమర్పణ



జనార్థన స్వామి ఆలయంలో ప్రాకార ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని జనార్థన, నగరేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భూనీళా సమేత జనార్థనస్వామి, రంగనాయక స్వామి వార్ల పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల మూడో రోజున ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి భక్తి శ్రద్ధలతో పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం ప్రాకార ప్రదక్షిణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం సేవాకాలం, ఆరగింపు, బలిహరణ, మంగళశాసనం, తీర్థ ప్రసాద వినియోగం చేసి అనంతరం ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి పెద్దింట్ల రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ఏలూరు (టూటౌన్) : భారత రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల పరిరక్షణ కోసం సామాజిక న్యాయం కోసం దళిత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబరు 4న ఢిల్లీలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ ఆదివారం పిలుపు నిచ్చారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఏలూరు (టూటౌన్): ఏలూరు రూరల్ మండలం కోమటి లంక గ్రామ శివారులోని కొల్లేరులో పేకాట ఆడుతున్న నలుగురిని ఏలూరు రూరల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.24 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.పేకాట శిబిరం నిర్వాహకులు కైకలూరుకు చెందిన చక్రి, దుర్గారావులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలియజేసారు.

కొల్లేరును 3వ కాంటూరు వరకు కుదించాలి



సీపీఎం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు (టూటౌన్): కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలని, కొల్లేరు ప్రజలకు నష్టం కలిగించే ఏకో సెన్సిటివ్ జోన్‌పై ఈ నెల 30న ఏలూరులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి చెప్పారు. స్థానిక పవరుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లేరు ఏకో సెన్సిటివ్ జోన్ పేరుతో 2011లో విడుదల చేసిన జీవోల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 5వ కాంటూరు పైన 10 కిలోమీటర్ల వరకూ పర్యావరణం పేరుతో 26 నిబంధనలు పెట్టి వేలాది మంది ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. 2006లో అప్పటి ప్రభుత్వాలు కొల్లేరు ఆపరేషన్ పేరుతో జిరాయితీ, సొసైటీ చెరువులను ధ్వంసం చేశారని తెలిపారు. ప్రభుత్వాలు స్పందించి కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, కొల్లేరు చుట్టు పక్కల ఫ్యాక్టరీల నుంచి వస్తున్న మురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని, రెగ్యులేటర్లు నిర్మించాలని, కొల్లేరులోని 22 వేల ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్, ఆర్ లింగరాజు, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగం ఆమోదం పొంది 73 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కార్యాలయాలు, చర్చిల్లో, రాజకీయ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో 74వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఘననివాళులర్పించారు. ఆయన అందించిన రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. స్థానిక నరసింహరావుపేటలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవ కార్యక్రమాన్ని సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజ్యాంగ దినోత్సవం అన్ని కార్యాలయాల్లో నిర్వహించాలంటూ ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తమ సంఘం తరుపున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కనికెళ్ళ మురళీ కృష్ణ, సిద్ధూ, రాజేష్ పాల్గొన్నారు.

● డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని భారత కరెన్సీపై ఎందుకు ముద్రించ లేదో ఈ దేశ పాలక, ప్రతిపక్ష పార్టీలు దళిత, బహుజన సమాజానికి సమాధానం చెప్పాలని జాతీయ సీనియర్ దళిత నాయకులు జాతీయ కన్వీనర్ డాక్టర్ పాలిమేర హరికృష్ణ కోరారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్లపూడి పాల్ రాజు, సాంగ మధుసూధన్‌రావు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

● లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలంతా ప్రతిన పూనాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ పిలుపు నిచ్చారు. రాజ్యాంగ



ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు, ఉద్యోగులు



పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాలిమేర హరికృష్ణ తదితరులు



డీపీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

ఆమోద దినోత్సవం సందర్భంగా స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రాజ్యాంగ పీఠకపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఎం నాయకులు బి.సోమయ్య, పంపన రవి, సీపీఐ నాయకులు పొటేలు పెంటయ్య, షేక్ హకీమ్ పాల్గొన్నారు.

● దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అబ్బూరి అనిల్ బాబు, కాపుదాసి రవి కుమార్, మత్తే బాబీ, ఎరికిపాటి విజయ్ కుమార్, నూకపెయ్యి కార్తీక్, కాకి నాని, రాగోలు సురేష్, కాకర్ల రతన్‌కుమార్ పాల్గొన్నారు.

● ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో స్థానిక 49వ డివిజన్ అంబేద్కర్ భవన్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నాగరాజు, అల్లం హనుమంతురావు,రాశేపల్లి సుబ్బారావు, బూసి రాధాకృష్ణ, జక్కుల అనిల్ కుమార్, బి.దుర్గారావు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై శిక్షణ తరగతులు

ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గిరిజన్ భవన్‌లో విభిన్న బహుజన, లౌకిక వాద సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సి.భాస్కరరావు, బీయస్‌యన్‌యల్ రిటైర్డ్ డీఈఈ శివాజీ, ఆర్గనైజర్లు దేవరకొండ వెంకటేశ్వర్లు, మేతర అజయ్ బాబు, పెరియార్, నేతల రమేష్ బాబు, పాలిమేర హరికృష్ణ, పి.త్రినాథ్, రమేష్ నాయక్, దేవరపల్లి రత్నబాబు, ఎస్.వసంత కుమార్, చింతాటి వెంకీ పాల్గొన్నారు.

● స్థానిక గ్జేవియర్ నగర్‌లోని బీసీ 2 వసతి గృహంలో ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్స్ సొసైటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మేతర అజయ్ బాబు, దోమతోటి అబ్రహం, జయలక్ష్మి, ఫాతిమా, గంగరాజు,చుక్కమ్మ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

● దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, రావూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రతిజ్ఞ

ఏలూరు(మెట్రో): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదివి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి దేవకీ దేవి, రిటైర్డ్ తహసీల్దార్ మణి, డిప్యూటీ తహసీల్దార్ మాధవి, సీనియర్ అసిస్టెంట్లు రవి చంద్ర, సాయి కిరణ్, కార్యాలయ సిబ్బంది నాగరాజు, జమాల్, సత్యం, విజయలక్ష్మి, కార్తికేయ పాల్గొన్నారు.

డీపీఓ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో డీపీఓ కార్యాలయం సిబ్బంది భారత రాజ్యాంగ నిర్మాత డా అంబేద్కర్, బాపూజీ చిత్ర పటాలకు పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ ప్రవేశిక వివరాలను చదివి డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

సమాచార శాఖ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం

జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా సమాచార పౌర సంబంధాధికారి ఆర్‌వీఎస్ రామచంద్రరావు డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదివి, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ దుర్గాప్రసాద్, డి. సౌరి ప్రసాద్, టి.బాబూరావు, పి.సాగర్, ఎం.మల్లేశ్వరి, రిటైర్డ్ అధికారి బి.ఎల్.నారాయణ పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

● ఉత్సాహంగా జ్వాలా తోరణ వేడుక
● ఘనంగా స్వామి వార్ల ఊరేగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆదివారం నగరంలోని శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా పలు శైవక్షేత్రాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము నుంచి భక్తుల గోత్రనామాలతో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణమ్మ వారికి కుంకుమ పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకరణ చేసి, ఆకాశదీప పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించి విశేష హారతి సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు జ్వాలాతోరణ పూజలు నిర్వహించి స్వామి వారికి విశేషంగా పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి రామబ్రహ్మనంద శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు. స్థానిక కొత్తపేట స్థానిక పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో నిత్య పూజ నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీప పూజ చేశారు. అనంతరం జ్వాలా తోరణ వేడుకలు ఘనంగా నిర్వహించి స్వామి వారిని ఊరేగించారు. కార్యనిర్వహణాధికారి డి. శంకర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. స్థానిక దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో వేంచేసియున్న సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామికి అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి జ్వాలా తోరణ పూజలు చేసి పల్లకి సేవ నిర్వహించారు. వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలు పర్యవేక్షించారు. వీటితో పాటు నగరంలోని దక్షిణపు వీధి జలాపహరేశ్వర స్వామి దేవస్థానం, మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి దేవస్థానం, అగ్రహారంలోని నగరేశ్వర స్వామి దేవస్థానం, అన్నపూర్ణ సమేత ప్రతాప విశ్వేశ్వర స్వామి దేవస్థానం, ఆదివారపు పేట మల్లికార్జున స్వామి దేవస్థానం, శ్రీ పర్వత వర్థని సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో విశేష అభిషేకాలు, నిత్య పూజలు చేశారు.



పత్తేబాద శివాలయం వద్ద జ్వాలాతోరణ వేడుక



విశేష అలంకరణలో పవర్‌పేట కాశీ విశ్వేశ్వర స్వామి



పత్తేబాద చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎన్‌సీసీ క్యాడెట్లుగా వివిధ రంగాలకు సేవలందించే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని, వాటిని క్యాడెట్లు సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించి సమాజ సేవలో పునరంకితం కావాలని 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఇన్‌ఛార్జ్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సమీర్ కర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఎన్‌సీసీ విభాగం 19 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో 76వ ఎన్‌సీసీ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో సీఆర్‌ఆర్ ఎన్‌సీసీ యూనిట్ మంచి పేరు సాధించి కళాశాలకు గౌరవం తీసుకువచ్చారన్నారు. ప్రిన్స్‌పాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు వారం రోజులుగా సమాజంలో వృద్ధులకు, అనాధ పిల్లలకు, విభిన్నప్రతిభావంతులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 22 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, ఇద్దరు ఆర్మీ జవాన్లు రక్తదానం చేశారు. సీఆర్‌ఆర్ కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎం. నవీన్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ జేసీఓ ఎంసీ డొమినిక్, రెడ్ క్రాస్ బ్రాంచ్ పీఆర్‌ఓ కేవీ రమణ, డాక్టర్. ఆర్‌ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన సీఆర్‌ఆర్ కళాశాల ప్రతినిధులు, ఎన్‌సీసీ అధికారులు

ఎన్‌సీసీతో విద్యార్థి దశలోనే సేవా భావం

ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరికీ సేవాభావం అలవడుతుందని, పెద్దల పట్ల గౌరవభావం పెరుగుతుందని సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎస్.రాజకళా శ్రీధరి తెలిపారు. ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సాయికుమారి శంకర్ ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం నగరంలోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ వీ.రఘుకుమార్ ఎన్‌సీసీ క్యాడెట్లను, ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ ఎస్.అనంత, వీ.రమణను ప్రత్యేకంగా అభినందించారు.



ప్రేమాలయం వద్ద సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు

ముగిసిన క్రీడాపోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమైన జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల క్రీడా పోటీలు, విశ్వవిద్యాలయ జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. 24వ తేదీ నుంచి జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి పలు క్రీడలకు సంబంధించిన జట్లు ఈ పోటీల్లో ఉత్సాహంగా తలపడ్డాయి. ఆయా క్రీడల పోటీలు శనివారం ముగియగా విజేతలకు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియేట్ కార్యదర్శి జీపీ రాజు, విశిష్ట అతిథిగా జేఎన్‌టీయూకే క్రీడాధికారి జీ. శ్యామ్‌కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను త్వరలో నిర్వహించనున్న దక్షిణ భారతస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే జేఎన్‌టీయూకే జట్లకు ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా సీఆర్‌ఆర్ విద్యా సంస్థల ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కిలారు ప్రభాకరరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనడానికి సుమారు 1,100 మంది క్రీడాకారులు తమ కళాశాలకు వచ్చి ఎంతో ఉత్సాహ వాతావరణంలో పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డిజిగ్నేటెడ్ రిప్రజంటేటివ్ కే. హరి రామకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ కొమ్మన సంజీవ రావు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ షేక్ నసీమా తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్ బాల్ పోటీలో విజేతగా నిలిచిన ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల మహిళల జట్టుకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

గీత కార్మికులంతా ఐక్యతను చాటాలి

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలవబడుతున్న గీత కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి తమ ఐక్యతను చాటాలని, అప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. స్థానిక వంగాయగూడెం ప్రాంతంలో గౌడ సమాఖ్య ఆధ్వర్యంలో ఏలూరు నియోజకవర్గ స్థాయి కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీసీల్లో అత్యధిక జనాభా కలిగిన గీత కార్మికులు ఒక్కో జిల్లాలో ఒక్కో పేరుతో పిలవబడుతున్నారని అన్నారు. గీత వృత్తిలోని గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత ఈ ఐదు కులాలు ఒక్కటేనని వీరి వృత్తి గీత గీయడం అని గుర్తు చేసారు. గీత వృత్తిదారులంతా విడివిడిగా ఉండటంతో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో గీత వృత్తిదారులు వెనుకబడి ఉన్నారని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీలు మేకా శేషుబాబు, అంగర రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రాంతీయ విభేదాలను పక్కన బెట్టి అంతా కలిసి కట్టుగా ముందుకు సాగాలన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్గాని చంద్రకిరణ్, ఎరుకుల సూరిబాబు, వీరంకి పండు, వీరంకి త్రినాథ్, ఉప్పాల జగదీష్ బాబు, చిట్టిబొమ్మ రంగారావు, ఎరుకుల సాంబశివరావు, కొనకళ్ల బుల్లియ్య, పెద్ద సంఖ్యలో గౌడ సంఘీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలు, ఆటలు ఎంతగానో ఆకర్షించాయి.



గౌడ సమాఖ్య కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న కేశన శంకరరావు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	13
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4822	--
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

వైభవంగా భవానమ్మ జాతర

భీమడోలు: పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ప్రజల ఇలవేల్పు శ్రీభవానమ్మ పంట జాతర అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఈనెల 19న ఆలయం నుంచి అమ్మవారిని ఉత్సవ మూర్తిని మేళా తాళాలతో తీసుకుని వచ్చి తాటాకులతో ప్రత్యేకంగా నిర్మించిన మేడల్లో కొలువుదీర్చారు. అక్కడ విశేష పూజలు చేసారు. వచ్చే నెలలో 2న అమ్మవారి ఊరడి, 3న అమ్మవారికి సాగనంపే కార్యక్రమం నిర్వహించారు. జాతర కమిటీ ఆధ్వర్యంలో ప్రతి రోజు అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను అందించారు. మేళ తాళాల నడుమ అమ్మవారి ఘటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు నైవేద్యాలను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు.

ప్రత్యేక హోదా హామీని విస్మరించిన ప్రధాని మోదీ



పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని 2014లో హామీ ఇచ్చి మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ తిరుపతి పర్యటనను నిరసిస్తూ మోదీ గోబ్యాక్ అంటూ సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, సీపీఐ నాయకులు పోటేలు పెంటయ్య మాట్లాడారు. తొమ్మిదేళ్లు గడిచినా ప్రధాన మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.సోమయ్య, ఆర్ లింగరాజు,కె.శ్రీనివాస్, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, న్యూడెమోక్రసీ నాయకులు యర్రా శ్రీనివాసరావు, కేవీ వెంకటరత్నం, కాకానాని, గడసాల రాంబాబు, పల్లి గంగరాజు, దూళ్ళ వీరినాయుడు, సీపీఐ నాయకులు ఎస్‌కె హాకీం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పాదయాత్రకు సంఘీభావం

పెదపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ధృడ సంకల్పంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేస్తున్న పాదయాత్ర కలపర్రుకు చేరింది. రఘురాజు పాదయాత్ర విజయనగరం జిల్లా ఎస్‌కోట మండలం బొడ్డవలస గ్రామం నుంచి తిరుమల తిరుపతి వరకు సుమారు 820 కిలో మీటర్లు మేర 43రోజులు నిర్విరామంగా జరుగుతున్న జయహో జగనన్న చలో తిరుమల యాత్ర కృష్ణా జిల్లాకు చేరుతున్న సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సంఘీభావం తెలిపారు. కలపర్రు టోల్ గేటు నుంచి ఆయనతో పాటు జిల్లా సరిహద్దు దాటే వరకు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, వీరమ్మకుంట సర్పంచ్ మరడాన చంటిబాబు, వల్లప్పు కోటిరెడ్డి పాల్గొన్నారు.